aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

మంగళవారం
10-02-2026 సంపుటి : 01 సంచిక : 16 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ, ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY



## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

- విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలి
- టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్య
- సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దు
- పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ - ఫిబ్రవరి 09 (మహాప్రభ)
సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ ' రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు.ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా

-మిగతా 3 లో

### రెండేళ్ల అభివృద్ధిని చూసి

# ఓటేయండి

## రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం

- 12 ఏళ్ల బీజేపీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన చూడండి
- మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో
- తెలంగాణ రూపాయి ఇస్తే..42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి






హైదరాబాద్ – ఫిబ్రవరి 09 (మహాప్రభ)
మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు.

-మిగతా 3 లో



## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు
- రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా

ఖమ్మం,– ఫిబ్రవరి 09 (మహాప్రభ)
రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

-మిగతా 3 లో



## మేం ఎవరికీ భయపడం

- యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదన్న ఇరాన్
- తమను శాసించే హక్కు ఎవరికీ లేదు
- అమెరికా సైనిక మోహరింపు తమను భయపెట్టలేవు
- అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - ఫిబ్రవరి 09 (మహాప్రభ)
అగ్రరాజ్యం అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరని, తాము ఎవరికీ భయపడేది లేదని అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బా అరాఘ్చి ఈ వ్యాఖ్యలు చేశారు.అమెరికా పై తమకు పెద్దగా నమ్మకం లేదని, యురేనియం శుద్ధిపై తామెందుకు వెనక్కి తగ్గాలని అరాఘ్చి అన్నారు. ఒకవేళ తమపై యుద్ధం ప్రకటించినా తాము దాన్ని వదిలేయబోమని చెప్పారు. తమను శాసించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ ప్రాంతంలో వారి (అమెరికా) సైనిక మోహరింపు తమను భయపెట్టలేదని చెప్పారు. అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య ప్రస్తుతం పరోక్ష చర్చలు జరుగుతున్నాయి.

-మిగతా 3 లో

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ



మెదక్, – ఫిబ్రవరి 09 (మహాప్రభ)
ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం

-మిగతా 3 లో

## సర్‌'కు అడ్డంకులు కల్పించవద్దు..

- పశ్చిమబెంగాల్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్
- సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటాం
- అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దు
- ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి





న్యూఢిల్లీ- ఫిబ్రవరి 09 (మహాప్రభ)
పశ్చిమబెంగాల్ లో నిర్వహిస్తోన్న 'సర్' ప్రిక్రియ ను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని స్పష్టంచేసింది. అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని సూచించింది.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కోసం 300 మంది అధికారులను కేటాయించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే 80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడంలేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొన్నది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు,

-మిగతా 3 లో

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

- 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- 11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు



హైదరాబాద్ – ఫిబ్రవరి 09 (మహాప్రభ)
తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార , ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ

-మిగతా 3 లో

## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

### కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టం



- మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం
- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు
- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం
- భూపాలపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

జయశంకర్ భూపాలపల్లి – ఫిబ్రవరి 09 (మహాప్రభ)
రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ..

-మిగతా 3 లో



## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..

- నోటీసు ఇచ్చేందుకు విపక్షాలు ప్లాన్
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ

న్యూఢిల్లీ:- ఫిబ్రవరి 09 (మహాప్రభ)
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. దీని కోసం నోటీసు ఇవ్వనున్నట్లు విపక్ష పార్టీలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మహిళా విపక్ష ఎంపీలపై కూడా స్పీకర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, వారిని సస్పెండ్ చేసినట్లు ప్రేమ్‌చంద్రన్ ఆరోపించారు. ఈ అంశంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలో తాము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఆ ఎంపీ వెల్లడించారు.సభను తమ తొత్తుగా భావిస్తూ నడిపిస్తున్నారని, ఇది ఆమోదయోగ్యం కాదు అని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. వారం రోజుల క్రితం లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. గాల్వాన్ ఘర్షణ గురించి మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో సభలో అప్పటి నుంచి గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రచురణ కాని పుస్తకం

-మిగతా 3 లో

## రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

- మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం, – ఫిబ్రవరి 09 (మహాప్రభ)
మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు.

-మిగతా 3 లో

# అట్టుడుకుతున్న మణిపూర్...

రెండు వర్గాల మధ్య ఘర్షణ
పదుల ఇండ్లకు నిప్పు
పక్క జిల్లాకు ప్రజల పరారీ
బీజేపీ సర్కార్ ఏర్పడిన కొద్ది రోజులకే హింస



**న్యూఢిల్లీ – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్ జిల్లాలో సోమవారం టాంగ్‌ఖుల్ నాగా, కుకీ వర్గాలు పరస్పరం దాడులకు తెగబడ్డాయి. సాయుధులైన దుండగులు లిటాన్ గ్రామంలో 20కిపైగా ఇండ్లకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు గాల్లోకి కాల్పులు జరిపినట్టు పేర్కొన్నారు. లిటాన్, టాంగ్‌ఖుల్ గ్రామానికి చెందిన ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇండ్లను వదిలి, పక్క జిల్లా కాంగ్‌పోక్పీకి పారిపోయారని తెలిసింది. లిటాన్ గ్రామంలో శనివారం రాత్రి నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై సామూహిక దాడి ఘటన.. తాజా హింసకు దారితీసిందని అధికారులు చెబుతున్నారు.


# గూండారాజ్యాన్ని మేం ఆమోదించం: సీజేఐ



**న్యూఢిల్లీ – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

గూండారాజ్యం ఆమోదయోగ్యం కాదు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో ఓ న్యాయవాదిపై జరిగిన దాడి కేసులో సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ న్యాయవాది దాఖలు చేసిన అత్యవసర పిటీషన్ పై సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆశ్రయించాలని కోరింది. ఫిబ్రవరి 7వ తేదీన తీస్ హజారీ కోర్టులో నిందితుడి తరపున వాదిస్తున్న లాయర్‌పై మరో వర్గానికి చెందిన లాయర్, అతని మనుషులు కోర్టులోనే దాడి చేశారు. జడ్జీ ముందునేగా ఆ అటాక్ జరిగింది. కోర్టులో అందరు ఉన్నప్పుడే ఈ ఘటన జరిగినట్లు ఆ న్యాయవాది తన పిటీషన్‌లో పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై స్పందిస్తూ.. జనవరి 7వ తేదీన జరిగిన ఘటన గురించి ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇన్ఫార్మ్ చేశారా అని సుప్రీం ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టు సీజేకు లేఖ రాసి, ఆ లేఖను తనకు కూడా పంపమని సుప్రీం సీజే అన్నారు. తొలుత హైకోర్టు చీఫ్ జస్టిస్ దీనిపై స్పందించాలన్నారు. అయితే పరిపాలనా విభాగం చర్యలు తీసుకుంటుదని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇలాంటి గుండారాజ్యం తమకు ఆమోదయోగ్యం కాదు అని, అంటే ఇక్కడ చట్టం విఫలమైనట్లే అని పేర్కొన్నది. తమ పరిధిలో ఉన్న హైకోర్టుకు వెళ్లాలని కోర్టు చెప్పింది.

# మనిషి కన్నా వేగంగా పరుగెత్తే రోబో!




**బీజింగ్ : – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

మానవుల కన్నా వేగంగా పరుగెత్తే 'రోబో'ను చైనా శాస్త్రవేత్తలు తయారుచేశారు. వేగానికి మారుపేరైన రన్నర్ ఉసేన్ బోల్ట్ పేరును ఈ రోబోకు పెట్టారు. షాంఘైకి చెందిన రోబోటిక్స్ కంపెనీ 'మిర్రర్‌మి టెక్నాలజీ' దీన్ని తయారుచేసింది. దీని ఎత్తు 5.7 అడుగులు, బరువు 75 కిలోలు. హ్యూమనాయిడ్ తరహాలో.. మానవులను పోలిన కదలికలు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. అయితే ఈ రోబో సెకన్‌కు 10 మీటర్ల వేగంతో మొత్తం 10 సెకన్లలో 100 మీటర్ల దూరం పరుగెత్తుతుందట! ఇదే దూరాన్ని 9.58 సెకన్లలో పూర్తిచేసి బోల్ట్ ఒలింపిక్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయనతో పోల్చితే రోబో స్వల్పంగా వెనుకబడింది. ఈ రోబో డెవలపర్స్ దీని అరంగేట్రం గురించి మాట్లాడుతూ మానవ రూపంలోని రోబోల ఉత్తమ పనితీరులో ఇదొక కీలక మైలురాయి అని తెలిపారు.

# ఆ బుక్ భయం వల్లే ప్రధాని సభకు రావడం లేదు

**న్యూఢిల్లీ: – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన పుస్తకం అంశంలో భయపడడం వల్లే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు రావడం లేదని రాహుల్ గాంధీ( అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ ప్రసంగం లేకుండానే ఆ తీర్మారాన్ని సభ ఆమోదించిన విషయం తెలిసిందే. ఎంపీల వల్ల ప్రధాని ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, ఎవరైనా మోదిని బెదిరిస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ అన్నారు. గడిచిన గురువారం కొందరు మహిళా ఎంపీలు లోక్‌సభలో ఆందోళన చేపట్టడం వల్ల ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అమెరికా వాణిజ్య ఒప్పందం అంశంలో భయపడుతున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో చర్చ చేపట్టేందుకు వణుకుతోందని



రాహుల్ విమర్శించారు. ఆ వాణిజ్య ఒప్పందం కుదిరిన తీరు, దాని వల్ల రైతులకు ఎదురుకానున్న సమస్యలను చెప్పేందుకు ప్రభుత్వం జంకుతోందన్నారు. ప్రధాని మోదీని బెదిరించేందుకు సభ్యులు ప్లాన్ చేశారన్న ఊహాగానాలు చాలా డిస్టర్బింగ్‌గా ఉన్నాయని, అలాంటి అంశం ఏమీ లేదని, సభ్యుల వల్ల కాదు.. తాను చెప్పబోయే నిజాన్ని తట్టుకోలేక, భయంతో ప్రధాని సభకు రావడం లేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ సభ్యులు ప్రధానిని అటాక్ చేసే ప్రశ్నే లేదని, ఆయన ధైర్యంగా సభకు రావాలని, ఎవరైనా దాడి చేస్తారన్న సమాచారం ఉంటే, ఆ వ్యక్తిని అరెస్టు చేయాలని, మీరెందుకు అలా చేయడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన పుస్తకం పట్ల మోదీకి భయం ఉన్నట్లు తెలిపారు. నరవాణే పుస్తకాన్ని పబ్లిష్ చేయలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారని, కానీ తమ వద్ద ఆ బుక్ కాపీ ఉన్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

# ఉదయం 8 వరకు కోడి కూత వినపడొద్దు!



**లండన్,– ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

తెల్లవారుజామున 4.30 గంటలకు వస్తున్న కోడి కూత.. పక్కింటి వాళ్లను చాలా ఇబ్బందిపెట్టింది. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయటంతో సదరు కోడిపుంజును పెంచుకుంటున్న యజమానికి నోటీసులు అందాయి. ఉదయం 8 గంటల వరకు కోడి కూత వినిపించడానికి వీల్లేదు.. అనేది నోటీసు సారాంశం. ఇంగ్లండ్ కౌంటీ 'నార్‌ఫోక్'లోని గ్రామీణ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై గ్రామంలోని 600 మందికిపైగా ప్రజలు సదరు కోడిపుంజుకు మద్దతుగా నిలబడేందుకు ముందుకు వచ్చారు. పొద్దునే వినిపించే ఆ కోడి కూతే తమ గ్రామానికి గుర్తింపుగా వారంతా పేర్కొన్నారు. నోటీస్‌పై కోడి పుంజు యజమాని స్పందిస్తూ కౌన్సిల్ నోటీస్ తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. మెరుగైన రోడ్లు, చెత్త సేకరణపై కౌన్సిల్ దృష్టిపెడితే బాగుంటుందని హితవు పలికారు.

# గోవాలో సమ్మతి లేకుండా ఫొటోలు తీస్తే అరెస్టే!



**పనాజీ – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

తమ రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సమ్మతి లేకుండా వారితో ఫొటోలు లేదా సెల్ఫీలు తీసుకొనే వారిని అరెస్ట్ చేస్తామని లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోవా పోలీసులు కఠినమైన కొత్త మార్గదర్శకాల్ని జారీ చేశారు. పర్యాటకులు వేధింపులకు గురి కాకుండా ఉండటానికి, వారి గోప్యతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పర్యాటకుల అనుమతి లేకుండా అపరిచితులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, ఫొటోగ్రాఫర్లు వారి ఫొటోలు తీయకూడదని తెలిపారు. వారి సమ్మతి లేనిదే వాటిని సామాజిక మాధ్యమాల్లోనూ పోస్ట్ చేయకూడదని స్పష్టం చేశారు. ఫొటోలు తీసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని పర్యాటకులపై ఒత్తిడి తీసుకురాకూడదు. అయితే పబ్లిక్ ప్రదేశాలు, సముద్ర తీరాలు, ప్రకృతి దృశ్యాలను ఫొటోలు తీసుకోవచ్చు. అయితే అందులోనూ వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యంగా చేసి ఫొటోగ్రఫీ తీయకూడదు.

# యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎఫెక్ట్..

## ఆసియాలో మెరుగైన స్థితికి భారత్

**న్యూఢిల్లీ : – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

అగ్రరాజ్యం అమెరికా తో ట్రేడ్ డీల్ తర్వాత ఆసియాలో భారత్ మెరుగైన స్థితికి చేరుకుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ అయిన జేఎం ఫైనాన్షియల్ నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం భారత మార్కెట్లకు సానుకూలాంశమని నివేదిక పేర్కొన్నది. భారత కరెన్సీ బలపడటానికి ఇది దోహదం చేస్తుందని తెలిపింది. భారత్–



అమెరికా దేశాల మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. ఈ డీల్ నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకోనందుకు ప్రతీకారంగా వేసిన 25 శాతం అదనపు సుంకాలను అమెరికా ఎత్తివేసింది. ఫలితంగా భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాలు 18 శాతానికి తగ్గాయి. పాకిస్థాన్, చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్ లాంటి పలు ఆసియా దేశాలపై అగ్రరాజ్యం అమలుచేస్తోన్న సుంకాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం.

# ఇదేనా మీ వృత్తి నైపుణ్యం..

## డిజిటల్ మోసాలపై బ్యాంకులకు సుప్రీం చీవాట్లు

**న్యూఢిల్లీ : – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**

డిజిటల్ అరెస్టు మోసం కేసులను పరిష్కరించడంలో బ్యాంకుల వృత్తి నైపుణ్యంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. కస్టమర్లు తమ జీవితకాల పొదుపు మొత్తాలను కోల్పోతున్నప్పటికీ అనుమానాస్పద లావాదేవీలను వెంటనే ఎందుకు అడ్డుకోవడం లేదని బ్యాంకులను సుప్రీంకోర్టు నిలదీసింది. అటువంటి మోసాలను ఎదుర్కొనడానికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర హోం శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ



శాఖ(మీటీ) దాఖలు చేసిన స్థాయీ నివేదికలను కేంద్రం సమర్పించిన సందర్భంగా ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం చేపట్టింది. కేసులకు సంబంధించిన డాటాను క్రోడీకరించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్‌ఓపీ)ని సిద్ధం చేస్తున్నామని అటార్నీ జనరల్ కోర్టుకు తెలిపారు. కస్టమర్లను రక్షించాల్సిన బాధ్యత బ్యాంకులకు ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ ఏడాది జనవరి 2న రూపొందించిన ఎస్‌ఓపీని అధికారికంగా స్వీకరించి అమలు చేయాలని, చోరీ అయిన నిధులను పునరుద్ధరించడానికి ఇంటర్-ఏజెన్సీ సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రొసీజర్లను నిర్ధారించాలని హోం శాఖని ఆదేశించింది.

## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

మొదటి తరువాయి

మారుస్తుందని చెప్పారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఏఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు.విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే కంటినిండా నిద్రపోవాలని ప్రధాని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంగా ఉండటం చాలా ముఖ్యమని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ప్రధాని తెలిపారు.

## మేం ఎవరికీ భయపడం

మొదటి తరువాయి

అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది.ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని ఈ సైనిక మోహరింపు ద్వారా అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి

## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ  కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమిషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

మొదటి తరువాయి

చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారంటూ తెలంగాణ సీఎంపై ఆయన మండిపడ్డారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరిలో జరిగిన ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఇది సీఎం రేవంత్ డైరెక్షన్‌లో జరిగిందంటూ ఆయన బల్లగుద్ది చెప్పారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్‌ని వ్యాఖ్యానించారు. జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే పోలీసులు చేసిన దహనఖాండ ఇది అని అభివర్ణించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..

మొదటి తరువాయి

వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. సర్ ప్రక్రియవల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..

మొదటి తరువాయి

నుంచి వ్యాఖ్యలు చేయవద్దు అని రాహుల్ గాంధీని స్పీకర్ కోరారు. వాస్తవానికి లోక్‌సభలో విపక్ష సభ్యుల సంఖ్య నామమాత్రమే. కానీ స్పీకర్‌పై వ్యతిరేకతను వ్యక్తం చేసేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు విపక్షాలు చెబుతున్నాయి. లోక్‌సభకు రావొద్దు అని శుక్రవారం ప్రధాని మోదీని తానే చెప్పినట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఇంకా లోక్‌సభలో కొనసాగుతున్నది. రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కూడా విపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఉదయం విపక్షాలు ఆందోళన చేపట్టడంతో సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.ఇక 2024 డిసెంబర్‌లో రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌కడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 14 రోజుల నోటీసు సమయం ఇవ్వకుండా అకస్మాత్తుగా నోటీసు ఇచ్చినందుకు దాన్ని డిప్యూటీ చైర్మెన్ తిరస్కరించారు. ధన్‌కడ్ పేరును కూడా సరిగా ప్రచురించలేదన్నారు.

# రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

మొదటి తరువాయి

బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా  రాస్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్  రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు



సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి  అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు.పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు.  కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షాణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

మొదటి తరువాయి

మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఆర్వో), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీవో), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్ట్రాంగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్  డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ప్రత్యేక సమావేశంతో ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

# రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

మొదటి తరువాయి

హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మీ డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి




కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.

# రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.  డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే



ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సంపాదకీయం

## తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి !



తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై విక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ విక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృథా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయినీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

# ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

-పోలింగ్ రోజున కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు.
-మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్.



**మెదక్ జిల్లా-09ఫిబ్రవరి (మహాప్రభ..**
మెదక్ మున్సిపాలిటీ పరిధిలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని వేస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల అమరిక, బ్యారికేడింగ్ విధానం వంటి అంశాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి రవాణా సమయంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మాడల్ డే కేర్ సెంటర్ పోలింగ్ కేంద్రాన్ని, అలాగే దయరా, నవాబ్‌పేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే విజయవంతంగా నిర్వహించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం.


ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.




**మెదక్ జిల్లా-09-ఫిబ్రవరి (మహాప్రభ)**
మెదక్ జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళి ప్రకారం నేటి సాయంత్రం 5.00 గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. సాయంత్రం 5గంటలకు అమల్లోకి వచ్చే సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం, మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, ప్రచార వాహనాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు లేదా ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. సైలెన్స్ పీరియడ్ సమయంలో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించామని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ మరియు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఎన్నికల నిబంధనలను గౌరవించి పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికల పక్రియ సాఫీగా జరగాలి.

జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ రాహుల్ రాజ్..



**మెదక్ జిల్లా-09ఫిబ్రవరి (మహాప్రభ)**
మున్సిపల్ ఎన్నికల పక్రియ సాఫీగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు.
సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో జరుగనున్న నాలుగు మున్సిపాలిటీ ఎన్నికలు సాఫీగా జరగాలనన్నారు. ఏవైనా ఎన్నికల నిర్వహణ పనులు పూర్తి కాకపోతే ఈ రోజు పూర్తి చేసి,రేపు ఉదయం 9 గంటల వరకు ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాశీలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి మార్గనిర్దేశనం చేయాలన్నారు. ఆర్వోలు, జోనల్ అధికారులు ఎన్నికల వస్తూ సామాగ్రిని పరిశీలించుకొని,పోలీస్ సంబంధిత ఎస్కార్ట్ వాహనం తో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నియమాలను అనుసరించి పత్రాలను నింపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ పాలనాల్లో కౌన్సిలర్రే సంపాదించుకొండ్రు

-దుబ్బాక మున్సిపాలిటీపై కమలం పువ్వు జండా ఎగరవేయాలి
- మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ బిఆర్ఎస్ ఏం చేసింది శూన్యం
- బిజెపి అభ్యర్థులను గెలిపించండి
- దుబ్బాక మున్సిపల్ అభివృద్ధి నా బాధ్యత
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు




**దుబ్బాక – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**
పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో కౌన్సిలర్ ఆస్తులు సంపాదించుకున్నారే తప్ప వార్డు అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని, ప్రతి దాంట్లో కమిషన్లు తీసుకొని రెండు మూడు అంతస్తుల బంగ్లాలు కట్టుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తరు. దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం దుంపలపల్లి, చెల్లాపూర్, దుబ్బాక, చర్వపూర్, ధర్మాజీపేట, లచ్చపేట, మల్లాయిపల్లి, వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు. బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..... ఎమ్మెల్యే తో ఏపని కాదంటుండు , అధికార పార్టీ తనకు నిధులు ఇవ్వడం లేదని చెబుతూనే తన పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అంటున్నాడు ఒకవేళ గెలిస్తే ఎమ్మెల్యే వాళ్లే కౌన్సిలర్లు అదే మాట అంటారు. ఇక దుబ్బాక అభివృద్ధి ఏం జరుగుతుందో అభివృద్ధి అనేది జరగాలంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బలపరిచిన బిజెపి అభ్యర్థులను గెలిపిస్తేనే అది సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్ ఎన్ చారి, విభీషణ్ రెడ్డి, కిష్టమ్మ గారి సుభాష్ రెడ్డి, వివిధ గ్రామాల బిజెపి సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు ప్రచారంలో పాల్గొనరు.

# హస్తం కు ఓటు వేస్తేనే దుబ్బాక అభివృద్ధి...!

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే" రెవెన్యూ డివిజన్
-హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించండి
-కాంగ్రెస్ నియోజకవర్గశీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి



**దుబ్బాక - ఫిబ్రవరి 09 (మహాప్రభ)**
దుబ్బాకలో 20 వార్డులోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా హామీ ఇచ్చారని, దుబ్బాకలో దోచుకున్న దొంగలకు ఓట్లు వేయొద్దని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ..... హస్తం కు ఓటు వేస్తేనే అధికారంలో ఉన్న పార్టీతో పాటు అభివృద్ధి అవుతాయని తెలిపారు. పేద ప్రజల పార్టీ అని, ఆపదలో ఉన్నవారికి ఆదుకునే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దుబ్బాకలో ఎంతోమంది దుబ్బాకలో ఓటర్లను తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. గెలిచి తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

-1వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి రమ్య, రాజేష్



**దుబ్బాక -ఫిబ్రవరి 09 (మహాప్రభ)**
ఒక్కసారి అవకాశం ఇవ్వండి 1వ వార్డును ఆదర్శవంతంగా అభివృద్ధి చేసి తీరుతానని ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో బి ఆర్ ఎస్ పార్టీ నుంచి 1వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని కౌన్సిలర్ అభ్యర్థి రమ్య, రాజేష్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం1వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను రూము కోరారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మళ్లీ రాబోయే ఎన్నికలలో ప్రభుత్వంలోకి వచ్చేది బి ఆర్ ఎస్ పార్టీ నే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత వాగ్దానాలను ఇచ్చి మోసం చేసిందని మాజీ సీఎం కేసీఆర్ పాలనాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పంట సమయానికి యూరియా, ఎరువులు అందించి రైతుబంధు, వేసి రైతులను ఆదుకునే వారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఒకటవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చినందుకు స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి, ఒకటో వార్డు తాజా మాజీ కౌన్సిలర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 11న కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ఢిల్లీలో మెరిసిన వరుణ్ ను సన్మానించిన రామకోటి సంస్థ

- తెలంగాణ నుండి గజ్వేల్ వాసుకి దక్కిన ఘనకీర్తి
- భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు




**దుబ్బాక -ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న ఆయిల్ వరుణ్ అనే విద్యార్థి ఢిల్లీలో జరిగిన 77వ రిపబ్లిక్ డే పరేడ్ లో తెలంగాణ ఎన్సీసీ తరఫున పాల్గొనడం తమ గ్రామానికి జిల్లాకు గర్వకారణం అని భక్తురత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు సోమవారం నాడు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నుంచి ఇప్పటివరకు ఢిల్లీ థర్డ్ లో పాల్గొన్నటువంటి వ్యక్తులు ఎవరు లేరని ఇది గజ్వేల్ కే కాక మొత్తం సిద్దిపేట జిల్లాకే గర్వకారణం అన్నారు. ఉన్నంత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థి తల్లిదండ్రులు ఆయిల శ్రీనివాస్, కృష్ణవేణి, పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి" కర్రు కాల్చి వాత పెట్టే సమయం ఆసన్నమైంది

-దుబ్బాక పై కెసిఆర్ కు ఎంతో ప్రేమ ఉంది
- దుబ్బాక కు రేవంత్ రెడ్డికి వచ్చే ముఖం లేదా..?
-ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**దుబ్బాక - ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
దుబ్బాక మున్సిపల్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి కరువు కాల్చి వాత పెడతారని, రెండున్నర కాలంలో దుబ్బాకకు ఏం చేశారని అందుకే మొఖం లేకుండా దుబ్బాకకు రావడం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. రామలింగన్న కట్టించిన డబుల్ బెడ్ రూమ్ లో తప్ప, ఆ బెడ్ రూమ్ లో సమస్యలు పరిష్కరించడంలో జాస లేదన్నారు బొగ్గు గనుల మంత్రిగా ఉన్న వివేక్ వెంకటస్వామి ఇటీవల వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారని, బొగ్గులను పాలతో కడిగితే తెల్లగా అవుతాయా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఓటు ఆయుధంగా వారికి బుద్ధి చెప్పాలని అరే శ్రవణ్ అన్నారు. దుబ్బాకలో బాలాజీ ఆలయాన్ని కట్టించింది కెసిఆర్ ఏ నని, అంతేకాకుండా విద్యను అభ్యసించేందుకు కేసిఆర్ స్కూల్ కూడా కోట్ల రూపాయలతో నిర్మించాలన్నారు. మోసాలకు మారుపేరు రేవంత్ రెడ్డి అని, తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. హోటల్కు సరైన సమయం వచ్చిందని మోసం చేసిన వ్యక్తులకు బుద్ధి చెప్పే సమయం ఎన్నికలతోనే సాధ్యమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ వార్డు అభ్యర్థులు, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ పై అసత్య ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

-మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**ఫిబ్రవరి 9 (నాయుడుపేట) మహాప్రభ.**
తిరుమల వెంక టేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందంటూ అసత్య ఆరోపణలు చేసి, స్వామివారి ప్రతిష్టను కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేటలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడినీ, భక్తుల విశ్వాసాలనూ వాడుకోవడం చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు నిదర్శనమన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థలైన ఎన్ డి ఆర్ ఐ, ఎన్ డి డి బి ల్యాబ్‌లు స్పష్టంగా నిర్ధారించాయని తెలిపారు. కూటమి నాయకులు అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ



పట్టించేందుకు చంద్రబాబు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యాఖ్యలతో ప్రజలతో పాటు కోట్లాది వెంకటేశ్వర స్వామి భక్తులు తీవ్రంగా చీదరించుకుంటున్నారని అన్నారు. ప్రజల దృష్టిలో పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయిన చంద్రబాబు,తన అబద్ధాలను నిజాలుగా చూపించేందుకు ఇంకా ఎన్ని కుట్రలు చేస్తున్నారో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇకనైనా వాస్తవాలను అంగీకరించి,ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎండీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి,వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి,వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి,నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి మండల వైసీపీ అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి,నియోజకవర్గ వైసిపి మహిళ విభాగం అధ్యక్షులు ఈదా రత్న శ్రీ,మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ షబ్బీర్,కావేరి పాకం అశోక్ కుమార్,వైసిపి నాయకులు గంధవల్లి సిద్దయ్య,మెస్ భాస్కర్ రెడ్డి,తన్నమాల రమణయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు కేసులో రేవంతు జైలుకు పోవడం ఖాయం

-అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్ ను దగ్ధం చేసిండు
-జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలు మాయం చేసిండు.
-ప్రమాదవశాత్తు జరిగింది కాదు.. రేవంతు డైరెక్షన్ లో జరిగిన ప్రమాదం అది.



**మెదక్- ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
-మెదక్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీశ్ ఫోరెన్సిక్ ల్యాబ్ జరిగిన అగ్ని ప్రమాదం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉంది. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ
-జైలుకు పోయే సమయం దగ్గరకు వచ్చిందని అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్ లో ఫోరెన్సిక్ ల్యాబ్ ను దగ్ధం చేసిండు. పోలీసుల సహకారంతో ఈ కుట్ర పన్నిండు హైద్రాబాద్ లో పేదల బతుకులు కూల్చిండు జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేసిండు
రేవంతు డైరెక్షన్ లో పోలీసులు చేసిన దహన ఖాండ ప్రమాద వశాత్తు జరిగింది కాదు, రేవంతు చేసింది. ఓటుకు నోటు కేసులో రేవంతుకు శిక్ష పడక తప్పదు, జైలుకు పోక తప్పదు.
రెండున్నరేండ్ల కాలంలో కాంగ్రెస్ చేసింది గుండు సున్నామిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు ముఖ్యమంత్రికానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదుఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి ఆయనకు భయం రుణమాఫీ మాట తప్పి మోసం చేసిండు రైతు బంధు ఎగ్గొట్టిండు ఎరువుల కరువు తెచ్చిండు రేవంతురేవంతు బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదు రంజాన్ తోఫా కూడా ఇవ్వడం లేదుషాదీ ముబారక్ చెక్కులు రావడం లేదుతులం బంగారం దిక్కు లేదుకేసీఆర్ మైనార్టీ గురుకులాలు కట్టారుషాదీ ఖానా ఏర్పాటు చేసారుకేసీఆర్ బిఆర్ఎస్ పార్టీని సెక్యూలర్ పార్టీగా నిలబెట్టారు. హిందూ ముస్లింలను అన్నదమ్ములుగా చూసింది. రేవంతు రెడ్డి తెల్లవారితే కేసీఆర్ ని తిడుతుంటాడు కేసీఆర్ ను తిడితే, హరీశ్ రావును తిడితే పేదల కడుపు నిండుతుందాఇక్కడి ఎమ్మెల్యే చాలా గొప్పోడుఎన్నికల సమయంలో 25 గంటల కరెంటు ఇస్తా అన్నడు కనీసం 12 గంటలు కూడా రావడం లేదుఆటో డ్రైవర్లకు ఏడాదికి 12వేలు అని గుండు కొట్టిండుఉద్యోగస్థులకు డీఏ లేదు, పీఆర్సీ లేదురిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్ బెన్ఫిట్స్ లేవుఅన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిండు రేవంత్ రెడ్డిఎస్సీ, బీసీ, ఎస్టీ పిలల చదువులను ఆగం చేసిండుబీసీలకు 42శాతం రిజర్వేషన్ అని దగా చేసిండు రెండు లక్షల ఉద్యోగాలని నిరుద్యోగులను మోసం చేసిండుకాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోకుంటే బిల్లులు రావని బెదిరిస్తున్నరట మెదక్ లో నీ పిట్ట బెదిరింపులకు, చిల్లర బెదిరింపులకు భయపడంబిల్లులు మీ జేబుల నుంచి ఇస్తున్నారా మీజాగిరాబరాబర్ బిల్లులు వస్తయి, కొట్లాడి సాధించుకుంటం అని అన్నారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇంచార్జ్ ఫారుక్ హుస్సేన్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి మాజీ యం ఎల్ సి సుభాష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి,మల్లికార్జున్ గౌడ్, తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షులు మామిళ్ల ఆంజనేయులు 31 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే మహాప్రభ

# నేటి నుంచి వైన్స్ షాపులు బంద్

### మద్యం ప్రియులకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయ



**నల్లగొండ , – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో నేటి నుంచి వైన్ షాపులు బంద్ కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న మునిసిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 9 సాయంత్రం 5 గంటల నుంచి ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 48 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం అమలులో ఉంటుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధ కాలంలో వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేయనున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అలాగే, ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యం అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నాయి. మద్యం నిషేధాన్ని ప్రజలు సహకరించాలని, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకారం అందించాలని అధికారులు కోరారు.

## ఘనంగా శివ సమితి సమక్షంలో అన్నదాన కార్యక్రమం



**అచ్చంపేట, – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట కేంద్రంలోని వై జంక్షన్ వద్ద శివ సమితి అధ్యక్షులు సుంకరి నిర్మల బాలరాజు ఆధ్వర్యంలో శివ స్వాములకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట పట్టణం నుంచి పాదయాత్ర చేస్తూ శ్రీశైలం వెళ్లే శివ స్వాములకు అన్నప్రసాదం అందజేశారు. గత పది సంవత్సరాలుగా ప్రతి శివరాత్రి సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని సుంకరి నిర్మల బాలరాజు దంపతులు నిరంతరంగా నిర్వహిస్తూ భక్తులకు సేవ చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు దంపతులకు శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆశీస్సులు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ అప్ప శివ, జెడ్పిటిసి రాంబాబు, అంతటి మల్లేష్, గొర్ల నరసింహ, సుంకరి లింగమయ్య, రాజు, మహేష్, విష్ణు యాదవ్, కృష్ణ యాదవ్, నిరంజన్, శీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు. శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్ఎస్ఎంఎ సమక్షంలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు




**అచ్చంపేట, – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల విద్యా జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమైన సంవత్సరం అని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం పరీక్షల సంవత్సరం మాత్రమే కాకుండా భవిష్యత్ దిశను నిర్ణయించే పునాది అని అన్నారు. భయపడాల్సిన అవసరం లేదని, సరైన ప్రణాళికతో చదివితే పదవ తరగతి సులభంగా పూర్తి చేయవచ్చని ధైర్యం చెప్పారు. పరీక్షలు మీ ప్రతిభను పరీక్షించడానికి మాత్రమే --- మీ విలువను కాదు. అందుకే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి అని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, క్రమబద్ధమైన చదువు, సమయపాలన, పునశ్చరణ అలవాటు విద్యార్థుల విజయానికి దోహదం చేస్తాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల మేనేజ్మెంట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం... కాంగ్రెస్ ప్రభుత్వంతో దుబ్బాకకు కొత్త ఊపిరి

**దుబ్బాక – ఫిబ్రవరి 09 (మహాప్రభ)**
గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందింది.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి నాయకత్వంలో అభివృద్ధి చెందుతుంది. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. దుబ్బాకలో గతంలో కాంగ్రెస్ పార్టీ ఆయాంలోని అభివృద్ధి చెందిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దుబ్బాక పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు దుబ్బాక పట్టణంలో నిర్వహించిన అన్ని వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల మద్దతుగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దుబ్బాక పట్టణంలో గత బి ఆర్ ఎస్ పాలనలో 13 మట్టి కూడా వెయ్యలేదని విమర్శించారు. మంత్రివర్యులు చెరుకు ముత్యంరెడ్డి వారి హయాంలో అభివృద్ధి జరిగిందని ఇప్పుడున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నిజకవర్గానికి కనీసం ఒక్క



ఆధునికమైన లైబ్రరీ కూడా తీసుకురాలేదు, ఇది నీ చేతగానితనం, ఇంకా దుబ్బాక ను అభివృద్ధి చేస్తానని ప్రజలను మోసం చేస్తున్నావు. ఎన్నికలు వచ్చాక డబ్బు సంచులతో ప్రజల్ని మభ్యపెట్టి నీచమైన రాజకీయ ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తూ దుబ్బాక ప్రాంతాన్ని అభివృద్ధి కాకుండా అడ్డుపడుతున్నావు. నీవల్ల నియోజక వర్గానికి శూన్యం తప్ప ఒరిగిందేమీ లేదు.

ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు..... ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర ఎన్నో పనులు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన దుబ్బాకని నేడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బంపర్ మెజార్టీతో గెలిపించి దుబ్బాక మున్సిపాలిటీలో సంపూర్ణ ఆధిపత్యం సాధించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు అభివృద్ధి కొనసాగాలంటే సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అమలవ్వాలంటే ప్రజల తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండాలని అన్నారు.

## మెదక్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్.

**మెదక్ జిల్లా– – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
మెదక్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత రావు, మెదక్ యం ఎల్ ఏ రోహిత్ రావ్ ప్రచారం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి రామ్ దాస్ చౌరస్తాలో
మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ మున్సిపాలిటీ మీద కాంగ్రెస్ జెండా ఎగురావేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంది. మున్సిపాలిటీ లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం లో నే అభివృద్ధి సాధ్యమన్నారు. మన అభ్యర్థులు గెలిస్తేనే మెదక్ లో అభివృద్ధి జరుగుతదన్నారు. మనను మోసం చేయననికి మళ్ళీ వస్తున్నారు.
సొంత కూతురే చెబుతుంది కెసిఆర్ అవినీతి చేశారన్నారు. మన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నాము.. రైతులకు రుణమాఫీ




చేశామన్నారు..కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పటిష్టమైన క్యాడర్ ఉన్నారు. మన నిధులు హరీష్ రావు తీసుకుపోయి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల కు తరలించ్చింద్రు,
దళితులకు మూడేకరాల భూమి ఇస్తానని ఇవ్వలేదు మేము వచ్చాక రేషన్ కార్డులు ఇచ్చాము. దళితున్ని సీఎం చేస్తామని మోసం చేశారు. తాము రెండేళ్లలో రెండు వేల కోట్లు తెచ్చాము. ప్రతి గ్రామంలో సన్నబియ్యం ఇచ్చాము. ఇందిరమ్మ పోటీచేసిన జిల్లా మెదక్ జిల్లా. ఏడుపాయల అభివృద్ధి కి సీఎం రేవంత్ రూ 35 కోట్లు ఇచ్చాడు. గత ప్రభుత్వంలో పేపర్ కే పరిమితమయ్యాయి మెదక్ చర్చి కి రూ 30 కోట్ల అభివృద్ధి నిధులు వెచ్చించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చందుపాల్, బి. కృష్ణ, అరుణాతి వెంకటరమణ మధుసూదన్ రావు సుమన్ మ్యాడం బాలకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భోలశంకరుడి శోభాయాత్ర

**గంగాధర, – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం మధురానగర్‌లో లయకారకుడైన శ్రీ రాజరాజేశ్వర స్వామి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. శివదీక్ష స్వాములు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆనందగిరి అయ్యప్ప స్వామి ఆలయం నుండి ఊరేగింపును ప్రారంభించారు. గ్రామంలోని నలుమూలల వీధులలో శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ శోభాయాత్రలో శివనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. శివ స్వాములు, భక్తులు, నృత్యాలు, శివతాండవంతో ఊరేగింపులో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో స్వాములు బస్మాధారణలో అఘోరాలను



తలపించేలా త్రిశూలం, డమరుకాలను చేత పట్టుకొని ప్రత్యేక ఆకర్షణలతో తాండవం చేశారు. భోళాశంకరుని అనుగ్రహం కోసం భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారికి హారతులు సమర్పించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. హరహర మహాదేవ... శంభో... శంకర... అంటూ శివనామస్మరణలతో పురవీధులు మారుమోగాయి. సాంప్రదాయ నృత్యాలు, శివతాండవం ప్రదర్శిస్తూ స్వాములు శోభాయాత్రకు జోష్‌ను జోడించారు. పరమశివుని శోభాయాత్ర భక్తిభావాలను మరింతగా పెంచి, అందరినీ ఆకట్టుకుంది. శివుడు విశ్వవ్యాప్తుడు. ఆయన కేవలం కైలాసపర్వతంలోనే కాదు, భక్తుల మనస్సులో కూడా ఉంటాడు. ఆయన కాలానికి అతీతుడు. కాలమన్నదే ఆయనలో నుండి ఉద్భవించింది. అందుకే శివునికి ఆది, అంతం ఉండవు. భక్తులు ఆయనను ఏ రూపంలో పూజించినా, ఆ తండ్రి వారికి ప్రసన్నమవుతాడనే విశ్వాసంతో ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గంగాధరలో జరిగిన ఈ శోభాయాత్ర భక్తి, వైభవం, సాంప్రదాయాల సమ్మేళనంగా నిలిచింది.

## శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్" జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి**

**కడ్తాల్, – ఫిబ్రవరి 09 (మహాప్రభ )**
గిరిజన ఆరాధ్య దైవం, శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజనులు ఘనంగా జరపాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, గానుగుమర్ల తండా గ్రామ ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని గిరిజన భవనంలో సేవాలాల్ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో "శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్" చిత్రపటానికి లక్పతి నాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.



అనంతరం లక్పతి నాయక్ మాట్లాడుతూ..ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ 287వ జయంతి వేడుకలను. కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు. గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంఘం అధ్యక్షులు జైపాల్ నాయక్, సర్పంచులు గోపి నాయక్, దేవసింగ్ నాయక్, అమర్సింగ్ నాయక్, శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ హరిచందర్ నాయక్, ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ శారద పండు నాయక్, గిరిజన నాయకులు జే. శంకర్ నాయక్, కొటియా నాయక్, భానావత్ శంకర్ నాయక్, భాజా శ్రీను నాయక్, రాజు నాయక్, నాగార్జున్ నాయక్, శ్రీధర్ నాయక్, శ్రీను నాయక్, గణేష్ నాయక్, రమేష్ నాయక్, భిక్కు నాయక్, స్వామిజి శివ నాయక్, టిక్లాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, కిషన్ నాయక్, తేజు నాయక్, వెంకటేష్ నాయక్, నాయకులు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రూ 1.58 లక్షలకు బంగారం..

### మరో రూ1,500 వరకు పెరిగిన తులం ధర



న్యూఢిల్లీ,
బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. గత వారంలో భారీగా తగ్గిన అతి విలువైన లోహాలు మళ్లీ అదే వేగంతో దూసుకుపోతున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో వెండి ధరలు ఆరు శాతం బలపడగా, పసిడి ధరలు ఒక్క శాతం చొప్పున ఎగబాకాయి. సోమవారం కిలో వెండి ఏకంగా 6 శాతం లేదా రూ.17 వేలు ఎగబాకి రూ.2.72 లక్షలు పలికింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,300 అందుకొని రూ.1,58,500 పలికింది.ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గోల్డ్ ధర రూ.2 వేల వరకు అధికమై రూ.1.61 లక్షలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ధరలు భారీగా పుంజుకోవడం, అమెరికా డాలర్ బలహీనంగా ట్రేడవుతుండటం వల్లనే ధరలు పుంజుకుంటున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచుగా పాలసీలను మార్చడం కూడా ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణమన్నారు. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ వెండి 2.19 డాలర్లు లేదా 2.81 శాతం పెరిగి 80.21 డాలర్లకు చేరుకోగా, బంగారం 5 వేల డాలర్లు అధిగమించింది.

## మార్కెట్లో కొనసాగిన లాభాలు.. 84 వేల పైకి సెన్సెక్స్, 26 వేలకు చేరువైన నిఫ్టీ

**ముంబై, ఫిబ్రవరి 9**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడంతో మదుపరుల్లో జోష్ పెంచింది. ఫలితంగా అన్ని రంగాల షేర్లు కదంతొక్కాయి. గత కొన్ని నెలలుగా టారిఫ్‌ల విధింపుపై నెలకొన్న అనిశ్చితి ముగింపు పలకడంతో సోమవారం ప్రారంభం నుంచే లాభాలబాట పట్టిన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 84 వేల పాయింట్ల పైకి చేరుకున్నది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 485.35 పాయింట్లు అందుకొని 84,065.75 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 26 వేల పాయింట్లకు చేరువైంది. 173.60 పాయింట్లు ఎగబాకి 25,867.30 వద్ద స్థిరపడింది. ట్రేడ్ డీల్ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపిందని, అలాగే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం సెంటిమెంట్‌ను మరింత



మెరుగుపరిచిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. కార్పొరేట్ల మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలపై మదుపరులు దృష్టిసారించడం, ప్రభుత్వరంగ బ్యాంకులు అంచనాలకుమించి రాణించడం కూడా కలిసొచ్చింది. ఇటీవల కరెక్షన్‌కు గురైన రియల్ ఎస్టేట్, కన్జ్యూమర్ ద్యూరబుల్ షేర్లు తిరిగి కోలుకోవడం సూచీల్లో జోష్ పెంచిందన్నారు.

**తీవ్ర ఒత్తిడిలో ఐటీ షేర్లు**
దేశీయ ఐటీ స్టాక్‌లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఏఐ ఆటోమేషన్ సంప్రదాయ అవుట్‌సోర్సింగ్ మాడల్ అందుబాటులోకి రావడం, ముఖ్యంగా ఈఆర్పీ అమలుతో ఈ రంగాలను దెబ్బతీస్తుందనే భయాలు నెలకొన్నాయి. దీంతో గత మూడు రోజుల్లో ఐటీ రంగ సూచీ 8 శాతం నష్టపోవడంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ రూ.2.5 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఈఆర్పీ మాడల్ ఐటీ సంస్థల ఆదాయాన్ని 30-40 శాతం రిస్క్‌లో పడే అవకాశాలున్నాయని మోతీలాల్ ఒస్వాల్ అంచనావేస్తున్నారు.

## హోండాకార్లపై 2 లక్షల డిస్కౌంట్

**న్యూఢిల్లీ,**
కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి వాహన తయారీ సంస్థలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే ఎక్స్ఛేంజ్ ఆఫర్లతోపాటు డిస్కౌంట్ అంటూ ఊదరగొడుతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి జర్మనీకి చెందిన హోండా కూడా చేరింది. ప్రస్తుత నెలలో హోండా తన మాడళ్ల ధరలను రూ.2 లక్షల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నట్టు ప్రకటించింది.వీటిలో సిటీ, అమేజ్, ఎలివేటివ్ మాడళు ఉన్నాయి. సిటీ, అమేజ్‌లపై రూ.1.97 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. ఈ నెల చివరి వరకు మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఆఫర్లలో నగదు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్, స్క్రాపేజ్ ప్రయోజనాలు, లాయల్టీ బోనస్‌లతో పాటు ఇతర ప్రయోజనాలు కూడా కల్పించనున్నది.



# స్పోర్ట్స్

## సఫారీల ధనాధన్.. కెనడాపై అలవోక విజయం

### మెరిసిన మార్క్‌రమ్, ఎంగిడి

అహ్మదాబాద్:
గత ఎడిషన్ రన్నరప్ దక్షిణాఫ్రికా టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. బ్యాట్‌తో పాటు బంతితోనూ చెలరేగి పసికూన కెనడాపై భారీ విజయాన్ని నమోదుచేసింది. టైటిల్ ఫేవరేట్లుగా ఉన్న సఫారీలు.. కెనడాపై 57 పరుగుల తేడాతో గెలిచారు. కెప్టెన్ ఎయిడెన్ మార్క్మ్ (32 బంతుల్లో 59, 10 ఫోర్లు, 1 సిక్స్) అర్థ శతకానికి తోడు డేవిడ్ మిల్లర్ (23 బంతుల్లో 39, 1 ఫోర్ , 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (19 బంతుల్లో 34, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికెల్టన్ (21 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ మెరుపులతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. అంతగా అనుభవం లేని కెనడా బౌలర్లపై ఆదినుంచే విరుచుకుపడ్డ మార్క్మ్,?ర డికాక్ (25) జోడీ.. 7 ఓవర్లలోనే 70 రన్స్ జోడించి శుభారంభం అందించింది.
సఫారీ సారథి బౌండరీల వర్షం కురిపించాడు. హాఫ్ సెంచరీ అనంతరమే అతడు నిష్క్రమించగా రికెల్టన్,



బ్రెవిస్ వికెట్లను ఒకే ఓవర్లో కోల్పోయినా ఆఖర్లో మిల్లర్, స్టబ్స్ మెరుపులు మెరిపించి ఆ జట్టుకు భారీ స్కోరునందించారు. కెనడా బౌలింగ్‌ను తుత్తునీయలు చేస్తూ ఈ ఇద్దరూ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించారు. అనంతరం ఛేదనలో సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి గజగజలాడి 20 ఓవర్లకు 156/8కే పరిమితమైంది. తొలి స్పెల్‌లోనే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' లుంగి ఎంగిడి (4/31) నిప్పులు చెరిగే బంతులతో 3 కీలక వికెట్లు తీసి కెనడాను కోలుకోనీయకుండా చేశాడు. అయితే నవ్‌నీత్ ధలివాల్ (49 బంతుల్లో 64, 7 ఫోర్లు, 1 సిక్స్), హర్ష్ ఠాకర్ (29 బంతుల్లో 33, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సఫారీల బౌలింగ్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవడమే గాక ఐదో వికెట్‌కు 69 రన్స్ జోడించి ఆ జట్టు పరువు కాపాడారు.
1 టీ20 ప్రపంచకప్‌లో అత్యధికసార్లు 200ం స్కోరు చేసిన జట్లలో దక్షిణాఫ్రికా (6) అగ్రస్థానంలో ఉంది. భారత్, వెస్టిండీస్ మూడుసార్లు ఈ ఘనత సాధించాయి.
సంక్షిప్త స్కోర్లు:
దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 213/4 (మార్క్మ్ 59, మిల్లర్ 39, అన్ష్ పటేల్ 3/31, దిల్‌ప్రీత్ 1/40);
కెనడా: 20 ఓవర్లలో 156/8 (నవ్‌నీత్ 64, హర్ష్ 33, ఎంగిడి 4/31, యాన్సెన్ 2/26)

## జింబాబ్వే శుభారంభం




**కొలంబో**
టీ20 మెగాటోర్నీలో జింబాబ్వే తమ ప్రస్థానాన్ని ఘనంగా మొదలుపెట్టింది. సోమవారం జరిగిన గ్రూపు-బీ పోరులో జింబాబ్వే 8 వికెట్ల తేడాతో(39 బంతులు మిగిలుండగానే) ఒమన్‌పై భారీ విజయాన్నందుకుంది. టాస్ గెలిచిన జింబాబ్వే.. ఒమన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్లెసింగ్ ముజర్బని (3/16), రిచర్డ్ నగ్వార (3/17), బ్రాడ్ ఇవాన్ (3/18) ధాటికి ఒమన్ 19.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ జింబాబ్వే బౌలర్లు ఆది నుంచే చెలరేగారు. దీంతో ఒమన్ 27 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది.వికెట్‌కీపర్, బ్యాటర్ వినాయక్ శుక్లా (28), సుఫియాన్ మహమ్మద్ (25) అంతోఇంతో జింబాబ్వే దాడిని ప్రతిఘటించారు. ఆ జట్టులో ఎనిమిది మంది బ్యాట ర్లు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఆ తర్వాత జింబాబ్వే 13.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (48లి), బ్రెండన్ టేలర్ (31) రాణించారు. జింబాబ్వే విజయంలో కీలకంగా వ్యవహరించిన ముజర్బనికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## షరతులు వర్తిస్తాయి!.. భారత్‌తో ఆడేందుకు పాక్ కొర్రీలు

### 48 గంటల్లో తెలుస్తుందన్న నఖ్వీ

**కరాచీ**
టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్నదానిపై అనిశ్చితి కొనసా..గుతూనే ఉంది. ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లబోయే (మ్యాచ్ రైద్దైతే) ఆస్కారమున్న నేపథ్యంలో ఐసీసీ ఈ మ్యాచ్‌ను ఎలాగైన నిర్వహించాలని చూస్తున్నా.. పాకిస్థాన్ మాత్రం తాము ఆడతాం కానీ తమ డిమాండ్లను నెరవేరిస్తేనే మ్యాచ్‌పై పునరాలోచిస్తామని ఐసీసీ ప్రతినిధికి వివరించినట్టు సమాచారం. కరాచీలో జరిగిన చర్చల్లో పాక్ బోర్డు..



ఐసీసీ ఎదుట పలు డిమాండ్లను ఉంచినట్టు తెలుస్తున్నది.అందులో ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ఇవ్వడం, ప్రపంచకప్ ఆడనప్పటికీ ఆ దేశానికి పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం, ఐసీసీ ఫ్యూచర్ టూర్స్‌లో బంగ్లాకు ఆతిథ్య హక్కులు అందించడం, భారత్-పాక్-బంగ్లాదేశ్‌తో ముక్కోణపు సిరీస్, భారత్-పాక్ ద్వైపాక్షిక సిరీస్‌ల పునరుద్ధరణ వంటివి ప్రతిపాదించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీటిలో చాలావరకూ ఐసీసీ పరిధిలోనివి కాకుండా భారత ప్రభుత్వం, బీసీసీఐ చేతిలో ఉన్నవే కావున ఆ విషయంలో ఐసీసీ నిస్సహాయంగానే ఉండే అవకాశాలున్నాయి. ఇదిలాఉండగా రాబోయే 48 గంటల్లో భారత్, పాక్ మ్యాచ్ భవితవ్యం తేలనుందని పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యానించడం గమనార్హం. ఐసీసీ, పీసీబీతో చర్చల్లో పాల్గొన్న బంగ్లా క్రికెట్ బోర్డు చీఫ్ అమినుల్ ఇస్లాం సైతం.. పాక్, భారత్‌తో మ్యాచ్ ఆడాలని సూచించడం విశేషం.






## 600 మంది డ్యాన్సర్లు..
## అదిరిపోయేలా నాని ది ప్యారడైజ్ ఇంట్రో సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ది ప్యారడైజ్. దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, తనికెళ్లభరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన నాని, మోహన్ బాబు పోస్టర్లు, గ్లింప్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలు కానున్నాయి.ది ప్యారడైజ్ నుంచి ఫస్ట్ సింగిల్‌ఝుఝుప్రవతీ ఇంట్రో సాంగ్ రానుందని తెలిసిందే. ప్రస్తుతం నాని ఇంట్రడక్షన్ సాంగ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ఈ పాటను చాలా గ్రాండ్‌గా తెరకెక్కిస్తుందట శ్రీకాంత్ ఓదెల టీం. అనిరుధ్ కంపోజిషన్‌లో వచ్చే ఈ పాటకు ఏకంగా 600 మంది డ్యాన్సర్లు స్టెప్పులేయబోతున్నారన్న న్యూస్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సుధాన్ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కుతున్న ఈ సాంగ్ టాలీవుడ్ చరిత్రలోనే బిగ్గెస్ట్ ఇంట్రో సాంగ్‌గా ఉండబోతుందట. నాని బర్త్ డే సందర్భంగా శ్రీకాంత్ ఓదెల ట్రీట్ ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. మాస్ బ్యాంగర్‌గా ఉండబోతున్న సినిమాకే హైలెట్‌గా నిలిచిపోనుందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. మొత్తానికి నాని ఈ సారి ఏదో గట్టి ప్లానే రెడీ చేసుకున్నాడని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్‌లో నటిస్తుండగా.. కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని-అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై క్యూరియాసిటీ పెరిగిపోతుంది.

## 11న నెట్‌ఫ్లిక్స్‌లో
## అనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లలాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.



## ఆ సమయంలో చాలా ఏడ్చా..
### ఎమోషనలైన యంగ్ బ్యూటీ కాయదు లోహర్

కాయదు లోహర్.. డ్రాగన్ సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. కాయదు లోహర్.. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. తన నటనతో ఈ చిన్నది మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఆమె 2000 ఏప్రిల్ 11న అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించింది. ఇక తెలుగులో ఈ బ్యూటీ అల్లూరి అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు తెలుగులో బిజీ కానుంది. ప్రస్తుతం విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఫంకీ సినిమలో హీరోయిన్ గా చేస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉంది కాయదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి కాయదు లోహర్ తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. మోడలింగ్ రంగం నుంచి సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టి ప్రస్తుత స్థాయికి చేరుకోవడం వెనుక తన కృషి, పట్టుదల ఉన్నాయని తెలిపింది ఈ ముద్దుగుమ్మ.. తన కెరీర్ ఆరంభంలో, కొన్ని సంవత్సరాల క్రితం, ఒకానొక సమయంలో తాను బాల్కనీలో కూర్చుని ఆలోచిస్తూ, "ఏమవుతోంది? ఏదీ వర్కవుట్ అవ్వడం లేదు. అంతా చాలా నెమ్మదిగా ఉంది. నేను దీన్ని చేయగలనో లేదో నాకు తెలియదు" అని నిరాశకు లోనయ్యానని గుర్తు చేసుకుంది కాయదు. తనలో పని చేయాలనే శక్తి, తనను తాను నిరూపించుకోవాలనే తపన ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లభించలేదని తెలిపింది. మోడలింగ్ చేసేటప్పుడు, కాలేజీలో ఉన్నప్పుడు తాను ఈ పరిశ్రమలో ఉండాలని అనుకున్నా.. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం నిరంతరం శ్రమించానని తెలిపింది. తనకు తెలిసింది ఒకటేనని, కష్టపడాలి, చిత్తశుద్ధితో ఉండాలి, చాలా బాధ్యతగా వ్యవహరించాలి.. పరిశ్రమలో తనకంటూ ఎలాంటి అండదండలు లేవని, పరిచయస్తులు గానీ, అవకాశాలు ఇచ్చే కుటుంబ సభ్యులు గానీ లేరని చెప్పుకొచ్చింది. ప్రతి ప్రాజెక్ట్, ప్రతి ఆడిషన్ కోసం తనను తాను నిరూపించుకోవాల్సి వచ్చిందని, ఇతరుల కంటే వంద శాతం ఎక్కువ కష్టపడాల్సి వచ్చిందని తెలిపింది.కొన్ని రోజులు ఎంత కష్టపడినా ఫలితం కనిపించక, ఏమి చేయాలో తెలియక చాలా బాధపడ్డానని, డిప్రెషన్‌లో కూడా ఉన్నానని, అనేక భావోద్వేగాలను ఎదుర్కొన్నానని తెలిపింది కాయదు. పెద్ద ప్రాజెక్టులు, ఆడిషన్స్‌లో అవకాశాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అప్పుడు తనకు భాషపై అంత పట్టు లేకపోవడం ఒక కారణమని చెప్పుకొచ్చింది. ఆడిషన్‌కు కేవలం గంట ముందు డైలాగులు ఇచ్చేవారని, భాషను సులభంగా గ్రహించేంత స్మార్ట్‌గా తాను లేనందున చాలా అవకాశాలు చేజారిపోయాయని.. ఆ సమయంలో చాలా బాధపడి, ఏడ్చానని, కానీ జరిగినవన్నీ సరైన కారణాలకే జరిగాయని తాను నమ్ముతున్నానని కాయదు చెప్పుకొచ్చింది.



## అదిరేటి డ్రెస్‌లో అందాల సెగలు..
## హెబ్బా ఏముందబ్బా!

టాలీవుడ్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు అందం, అభినయానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ముఖ్యంగా ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే యూత్‌లో విపరీతమైన పాపులారిటీ సంపాదించుకుంది. మొదటి సినిమాతోనే తన నటన, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.అలా ఎలా సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమై చిన్నది హెబ్బా పటేల్. ఈ మూవీలో ఈ అమ్మడు తన అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. అంతే కాకుండా మూవీ కూడా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇక ఈ మూవీ తర్వాత అమ్మడుకు అవకాశాలు క్యూ కట్టాయనే చెప్పాలి.అలా ఎలా తర్వాత ఈ ముద్దుగుమ్మ కుమారి 21 ఎఫ్‌లో నటించి, ఈ మూవీలో ఈ బ్యూటీ గ్లామర్‌తో కుర్రకారుకు చెమటలు పట్టించిందనే చెప్పాలి. ఈ మూవీతో ఒక్కసారిగా యూత్ క్రష్ అయిపోయింది. దీంతో ఈ చిన్నదానికి టాలీవుడ్‌లో వరసగా ఆఫర్స్ వచ్చాయి. అయినా కానీ ఈ అమ్మడుకు అదృష్టం కలిసి రాలేదనే చెప్పాలి.దీని తర్వాత ఎక్కడికి పోతావు చిన్న వాడ, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, ఈడో రకం, వాడో రకం, ఏంజిల్, 24 కిసెస్, మిస్టర్ , ఓదెల , ఓదెల 2 ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ అందుకోలేకపోయింది. అంతే కాకుండా, గ్లామర్ ఉన్నా కూడా అంతా సక్సెస్ అవ్వలేకపోతుంది.ఇక సినిమాల విషయం ఎలా ఉన్నా, ఈ బ్యూటీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన అంద చందాలతో ప్రతి ఒక్కరి మనసు దోచేసుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ అదిరిపోయే డ్రెస్‌లోని క్యూట్ ఫొటోస్ షేర్ చేసింది. ప్రస్తుతం ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com